క్లుప్తంగా

'అరెస్టులతో ప్రజాఉద్యమాలు ఆపలేరు'

కాగజ్‌నగర్‌టౌన్: అరెస్టులతో ప్రజాఉద్యమాలు ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. ప్రభుత్వ రాయితీలతో ప్రారంభమైన సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరినందుకు శుక్రవారం తెల్లవారుజామున సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా నాయకులు అంబాల ఓదెలు తదితరులు ఉన్నారు.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ నియోజకవర్గంలో శుక్రవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పర్యటన సందర్భంగా చింతగూడలోని సీఐటీయూ నాయకులను కాగజ్‌నగర్‌రూరల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై మాట్లాడే అవకాశాన్ని ప్రభుత్వం ముందస్తు అరెస్టులతో కాలరాస్తుందని మండిపడ్డారు.

నేడు ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బుచ్చిలింగం మార్గ్ ఎదురుగా (పెట్రోల్ పంపు ఏరియా)లో ఉన్న షణ్ముఖ ఆస్పత్రిలో యాజమాన్యం తరపున బెజ్జూర్ మండల ప్రజలకు ఉచితంగా అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ఆస్పత్రి యజమాని యాద వినయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30న ఉదయం 11 గంటలకు షణ్ముఖ ఆస్పత్రి ఆవరణలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేతుల మీదుగా ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అన్ని వేళల్లో అంబులెన్స్‌ను ఉచితంగా, ఏ ఆస్పత్రికైనా వెళ్లేందుకు వినియోగించుకోవచ్చన్నారు. మండల వాసులు ఉచిత అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన శాంతియుత సమ్మె 26వ రోజుకు చేరుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ శుక్రవారం సమ్మె చేస్తున్న ఉద్యోగులకు మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 వేలకు పైగా కాంట్రాక్ట్ కార్మికులు 26రోజుల నుంచి శాంతియుత సమ్మె చేస్తున్నారని, వీరి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మద్దతుగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నివారించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అమరేందర్

దహెగాం: ప్లాస్టిక్ వాడడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో ప్లాస్టిక్ చెత్త సేకరించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నోముల శేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, అధ్యాపకులు మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూవో సావిత్రి

ఆసిఫాబాద్అర్బన్: పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని డీడబ్ల్యూవో సావిత్రి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కంచుకోట కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మహిళలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో రుక్సానా, సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, అరుణ, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు.. దోమలతో పాట్లు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు ఏరియా కాలనీలోని ఖాళీ స్థలం. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసంగా మారింది. దీంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిల్వ నీటిని తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కౌటాల -విజయనగరం రోడ్డు వెళ్లే మార్గంలో ఖాళీ ప్లాట్‌లో నిలిచిన నీరు

- ఖాళీ ప్లాట్లలో నిలుస్తున్న నీరు
- పెరుగుతున్న దోమల బెడద
- రోగాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు

కౌటాల: మండల కేంద్రంలోని పలు కాలనీల సమీపంలో గల ఖాళీ ప్లాట్లతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీ ప్లాట్ల స్థలాలు వర్షం నీరు నిలిచి అపరిశుభ్రతతో అనారోగ్యానికి కారణమవుతున్నాయి. కౌటాలలో గ్రామీణులు, ఉద్యోగులు ఇళ్ల స్థలాల కొనుగోలుకు ఆసక్తి చూపుతుండడంతో ప్లాట్ల ధరలకు రెక్కలొచ్చాయి. ప్లాట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇలా కొనుగోలు చేసిన ప్లాట్లు చాలా వరకు ఖాళీగా ఉంటున్నాయి. కాగా అవి నిర్వహణ లేక అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి.

దోమలకు అడ్డాగా..

ఖాళీ ప్లాట్ల స్థలాల్లో నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. యజమానులు ప్లాట్లను చదును చేయకపోవడంతో పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు మురుగునీరు నిలుస్తుండడంతో స్థానికులు తిప్పలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి విజయనగరం గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో ఖాళీగా ఉన్న ప్లాట్లలో, కౌటాల -మొగడ్‌దగడ్ రోడ్డు సమీపంలో ఉన్న ఖాళీ ప్లాట్లలో వర్షం నీరు నిలిచి ఉంటుంది. ఖాళీ ప్లాట్ల స్థలంలో చెత్తాచెదారం కూడా వేస్తుండడంతో దోమల బెడద పెరుగుతోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నా ప్లాట్ల యజమానులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో రోగాల బెడద

మండల కేంద్రంలోని ఖాళీ స్థలాలతో పాటు గ్రామాల్లో సైతం ఖాళీస్థలాల్లో చెత్తాచెదారం, మురుగునీరు పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. కొన్ని నెలల నుంచి గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేసిన దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని మండలవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నిల్వ నీటిని తొలగించాలి

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న ఖాళీ ప్లాట్లలో నెలల తరబడి వర్షం నీరు నిలిచి ఉంటుంది. నిల్వ నీటిలో వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్లాట్ల యజమానులు ప్లాట్ల ఖాళీ స్థలం నుంచి నీటిని తొలగించి గుంతలను మట్టితో పూడ్చి వేయాలి. – ఆనంద్, ప్రగతికాలనీ, కౌటాల

పారిశుధ్య పనులు చేయిస్తున్నాం

కౌటాల గ్రామ పంచాయతీ పరిధిలో రోజూ పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నాం. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయించాం. ఓపెన్ ప్లాట్లలో నీరు నిల్వ ఉంటే యజమానికి నోటీసులు అందిస్తాం. నిల్వ నీటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. కాలనీల్లో దోమల మందు పిచికారీ చేయిస్తున్నాం.

– ఎస్. సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, కౌటాల

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులు క్రమశిక్షణతో ఐకమత్యంగా ఉండాలని ఎన్‌సీసీ అధికారి ప్రియాంక, ప్రిన్సిపాల్ దివ్యారాణి సూచించారు. శుక్రవారం ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులను బూర్గుడలోని గిరిజన డిగ్రీ గురుకుల కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థినులు క్రమశిక్షణతో దేశానికి సేవ చేయాలని కోరారు. కళాశాల నుంచి ఎంపికైన 25మంది విద్యార్థినులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. పీఐ స్టాఫ్ వందన, బెటాలియన్ అధికారులు తేజ్‌సింగ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా 'మేరీ మాటీ.. మేరా దేశ్'

కెరమెరి: అమరవీరుల త్యాగాలకు గుర్తుగా తపాలాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని జోడేఘాట్‌లో 'మేరీ మాటీ.. మేరా దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమురంభీంకు నివాళులర్పించి సమాధికి పూజలు చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో మట్టి సేకరించారు. దేశ రాజధానిలో నిర్మించనున్న అమరుల స్తూప నిర్మాణానికి సేకరించిన మట్టి పంపించనున్నట్లు పోస్టల్ అధికారి సతీశ్ తెలిపారు. తపాలాధికారి తాజ్‌ముల్ హుస్సేన్, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

స్థానికంగా ఉండి సేవలందించాలి

జైనూర్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మారుమూల ప్రాంతాల్లో వ్యాధులు విజృంభిస్తున్నందున వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధుల బారిన పడిన వారికి సరైన చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్, సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఉస్మానియా మజీద్ కాలనీలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు బాలేశ్వర్‌గౌడ్, గాదెవేణి మల్లేశ్, అహ్మద్‌బిన్ అబ్దుల్లా, అబ్దుల్లా, ఫయాజ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన



కెరమెరి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



దహెగాం: భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

కెరమెరి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ నాయకుడు కూటికల ఆనంద్, అనసూయ, స్రవంతి, కవిత, గుణసుందరి, అయ్యూబాయి, సంగీత, బొజ్జుబాయి, లింగుబాయి, అనిత, ప్రమీల, తిరువన, గంగుబాయి, రేణుక తదితరులు ఉన్నారు.

దహెగాంలో..

దహెగాం: డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వారు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వజ్రమ్మ, శోభ, కల్పన, పద్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌లో..

జైనూర్: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించకుండా కొనసాగిస్తామని అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగామణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెతో పాటు భిక్షాటన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు తదితరులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 19 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు శుక్రవారం మండల కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే అక్టోబర్ 10న ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు రాజేశ్వరి, బాలమ్మ, చంద్రకళ, సాంబలక్ష్మి, ప్రమీల, తిరుపతమ్మ, భారతి, సామల, మంజుల, స్వర్ణలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న జన్కాపూర్ మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జనం శుక్రవారం ముగిసింది. శివకేశవ మందిర్‌లో నెలకొల్పిన గణనాథుడు, బజార్‌వాడిలో నెలకొల్పిన సంఘసేవక గణేశ్ మండలి గణనాథుడు, జన్కాపూర్ శ్రీరామ భక్త గణేశ్ మండలితో పాటు జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణనాథులను నిమజ్జనం చేశారు. ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం సన్నాయి వాయిద్యాలు, బ్యాండ్‌మేళాతో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు, యువతులు కోలాటం, దాండియా నృత్యాలు ఆకట్టుకున్నాయి. డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. పెద్దవాగు వద్ద లైటింగ్‌తో పాటు నిమజ్జనం చేసేందుకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

పోటాపోటీగా లడ్డూ వేలం

శివకేశవ మందిర్ గణేశ్ మండలి లడ్డూను వేలంలో స్థానిక వ్యాపారి గుండ ప్రసాద్ రూ.39,116లకు దక్కించుకోగా, కరెన్సీ దండను స్థానిక వ్యాపారి పుల్లూరి శంకర్ రూ.29,116 దక్కించుకున్నారు. జన్కాపూర్ రామభక్త గణేశ్ మండలి వద్ద నిర్వహించిన లక్కీ డ్రాలో బైక్‌ను పట్టణానికి చెందిన అలీ అహ్మద్, తారకరామానగర్‌లోని శ్రీసాయి గణేశ్ మండలి వద్ద నిర్వహించిన లక్కీడ్రాలో కుర్సెంగ సుధాకర్ 4 గ్రాముల బంగారం, కుందారపు సాయిరాం లడ్డూను రూ.6100కు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తాటిపెల్లి దిలీప్, బోనగిరి మురళీధర్, గుండ బాలేశ్వర్, చిలువేరు వెంకన్న, గుండ ప్రమోద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్, బీసీ సంఘం నాయకుడు మారుతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని పల్లెల్లో వినాయక నిమజ్జనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బూర్గుడ, అప్పపల్లి, మోతుగూడతోపాటు ఆయా గ్రామాల్లో 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణలు నిర్వహించారు.



దక్కించుకున్న లడ్డూతో ప్రసాద్ -నిఖిత దంపతులు



నృత్యం చేస్తున్న మహిళలు



పూజలో పాల్గొన్న వాసవీ గణేశ్ మండలి మహిళలు

సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల సమ్మె



కెరమెరి: నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఆశ వర్కర్ల సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరింది. వైద్య సిబ్బందికి అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తున్నప్పటికి ప్రభుత్వం చాలీచాలని వేతనాలు అందిస్తుందని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు ఆనంద్, ఆశా కార్యకర్తలు అరుణ, భారతి, సావిత్రి, దుర్పత, నీలాబాయి, లక్ష్మి, లలిత, సరోజా ఉన్నారు.

సమ్మెకు కాంగ్రెస్ నాయకుల మద్దతు



మాట్లాడుతున్న కోరళ్ల కృష్ణారెడ్డి

బెజ్జూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు శుక్రవారం టీపీసీసీ సభ్యుడు కోరళ్ల కృష్ణారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారికి మధ్యాహ్న భోజనం అందించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశ వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. సిర్పూర్ తాలూకా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ కన్వీనర్ అల్లూరి రాజు, బెజ్జూర్ మండల అధ్యక్షుడు సత్తయ్య, సిర్పూర్ మండల అధ్యక్షుడు శంశొద్దీన్, పెంచికల్‌పేట మండల అధ్యక్షుడు అతాహాబేగ్, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు ఇస్రాయిల్, శైలేష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల మద్దతు..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశా వర్కర్లకు బీజేపీ నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశా వర్కర్లను శ్రమ దోపిడీ చేస్తూ ఇబ్బంది పెడుతున్న కేసీఆర్ విధానాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు

కౌటాల: అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కౌటాలలో అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

రైతులు యూరియా వాడకం తగ్గించాలి

కాగజ్‌నగర్‌రూరల్: అవసరం లేకున్నా పురుగు మందులు అంటగట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఫర్టిలైజర్ షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని రాస్పెల్లి, గజ్జిగూడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. పత్తి, వరి పంటలకు వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. గులాబీరంగు పురుగు వచ్చే అవకాశమున్నందున రైతులు వేపనూనె పిచికారీ చేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం రుణమాఫీపై సందేహాలను నివృత్తి చేశారు.

కదిలిన బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కౌటాల మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశానికి తరలివెళ్లారు. శుక్రవారం ద్విచక్రవాహనాలపై ర్యాలీగా బయల్దేరి వెళ్లారు.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జిని కలిసిన నాయకులు



సన్మానిస్తున్న మండల నాయకులు

రెబ్బెన: బీజేపీ నూతన జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన ఆరుముల్ల పోశంను శుక్రవారం మండలానికి చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంచిర్యాల జిల్లా సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరుముల్ల పోశంను అధిష్టానం జిల్లా ఇన్‌చార్జిగా నియమించిన సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, బెల్లంపల్లి ప్రభారి అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణలు కలిసి శాలువాతో సన్మానించారు.

మంత్రి ఐకేరెడ్డిని కలిసిన బెజ్జూర్ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి వచ్చిన రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ బెజ్జూర్ మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు జగ్గాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, శ్రీ రంగనాయక స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జాహిద్ హుస్సేన్, సతీశ్ కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు తిప్పలు



కెలిబి కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న నీరు

కెరమెరి: మండలంలోని సాంగ్వి, కెలికే, కెలిబి తదితర గ్రామాల్లో శుక్రవారం కురిసిన వర్షానికి కెలిబి సమీపంలోని కల్వర్టుపై నుంచి నీరు ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. సాయంకాలం వరకు నిరీక్షించి ప్రవాహం తగ్గాక రాకపోకలు సాగించారు.